# మఫ్!

నా మొగుడు వట్టి మఫ్! ధైర్యంలేని చవట సన్నాసి! అటాంటి వాడిని నా మొగుడని చెప్పుకోవటానికే సిగ్గుగా వుంది..... కేర్‌లెస్‌గ ...ఓ స్టేట్‌మెంట్ పారేసింది నీరజ.

నీరజ అంటే అలాంటి ఇలాంటి ఆడది కాదు. గట్స్ వున్నది. తన నెవరైనా అబల అంటే మీదపడి పీక పిసికేస్తుంది.

ఎవ్వరినీ లక్ష్య పెట్టదు. చివరకు మొగుడైనా సరే! - నీరజ మేడమ్ ఓ పెద్ద కంపెనీలో సి.ఇ.ఓ.! నెలకు లక్షన్నర జీతం! కారు బంగళా ఇతర ఎలవెన్స్‌లు.. తరచు ఫారిన్ ట్రిప్స్....బోలెడంత బాంకు బేలన్స్...పూటకో చీరె.... రాజుకో హేయిర్ స్టైలు... మనిషీ హేండ్సమ్‌గ వుంటుంది.

పాలరాతి బొమ్మలాగా... పసిడి ఛాయలో ఎప్పుడూ నవ్వుతూంటే... లిప్‌స్టిక్ దిద్దుకునే ఆమె లేలేత పెదవులు తళతళ మెరుస్తూంటే... బ్రహ్మకైనా పుట్టు దిమ్మ తెగులు అనిపిస్తుంది.

స్లీవ్‌లెస్ జాకెట్లో ఆమె సోయగం... శారీలో కవ్వించే అందాలు... చూస్తూ ఎలాంటి వాడైనా మెస్మరైజ్ అవుతాడు... 'ఢాం'ని కళ్లు తిరిగి పడిపోతాడు.

'చూడు నీరజా! నీవెంత చదువుకున్నా... ఎంత పెద్ద ఉద్యోగం చేస్తున్నా... ఎంత సంపాదిస్తున్నా... నీవు భర్త అనే వాడిని గౌరవించడం భార్యవైన నీకు కనీస మర్యాద. నీ సబార్డినేట్ స్టాఫ్‌ని తిడితేనే వూరుకోని ఈ రోజుల్లో తాళి కట్టిన మొగుడ్ని తిడుతూంటే వూరు కుంటాడా?...నో! పిల్లిని గదిలో బంధించి చావగొడితే ఏం చేస్తుంది?.. విసిగి పోయిన మొగుడైనా అంతే! ఏదో ఒక రోజు నీ మీద తిరగబడతాడు. సో!.. మై డియర్ డాటర్..ఓర్పును సహనాన్ని పెంచుకో...!

డాడీ రామోజీరావ్ ఇచ్చిన సలహా నీరజకు నచ్చలేదు.

'ఇద్దరం కల్సి చదువుకున్నాం కదానే.. అభిమానంతో భరద్వాజ్‌తో క్లోజ్‌గా మూవ్ అయిన నేరానికి... చివరికి అతగాడితో తాళి కట్టించు కున్నందుకు విచారిస్తున్నాను డాడీ...

డోంట్ ఫీల్ సారీ ఫర్ ఎవరీ థింగ్! విషయం చెప్పు నీరజా...' భార్య అందించిన కాఫీ అందుకుని కూతురి ముఖంలోకి చూస్తూ అడిగేడు రామోజీరావ్.

'మరే...మరే.... అసలేం జరిగిందంటే..చెప్పబోయి తల్లి ముఖంలోకి చూచి ఆగింది.

'ఏమిటే ఆ నసుగుడు?...తల్లి నీరజ కళ్లల్లోకి సీరియస్‌గా చూచింది.

'నా భర్తకి వళ్లంతా కుళ్ళే మమ్మీ! నేను వెరైటీ డ్రెస్స్ వేసుకోవటం నచ్చదు... నేను హేపీగా నవ్వుతూ వుండటం చూచి ఓర్వలేడు. తన కంటే నా శాలరీ.. స్టేటస్సు ఎక్కువని కడుపు మంట! వెరీ డర్టీ ఫెలో! అలాంటి వాడు నా మొగుడని చెప్పుకోటానికే షేమ్‌గా వుంటోంది.

ఒక్క నిముషం ఆలోచించిన రంజని 'చూడమ్మా!... జరిగిపోయిన పెళ్లి గురించి పదే పదే బాధ పడుతుంటే మనశ్శాంతి కరువౌతుంది. నీవు హేపీగా వుండలేవు. అల్లుడు ఎలాంటివాడైనా... ఏమన్నా... ఎన్నెన్నా... నువ్వే సర్దుకు పోతే అంతా హేపీస్! ప్రాబ్లమే వుండదు. తాళి కట్టిన వాడిని ఇప్పుడు కాదనుకోవటం... సతాయించటం.. సాధించటం సబబు కాదు నీరూ...'నచ్చ చెప్పబోయింది.

'నాన్సెన్స్! నీవన్నీ డర్టీ ఓల్డ్ థాట్స్! ఐ డోన్ట్ లైక్! భారద్వాజ్ బ్రిలియంట్ కదా. ఐ.ఎ.ఎస్. పాసై కలక్టరౌతాడనుకున్నాను. మనిషి వస్తాదులా వున్నాడు కదా.. పోనీ ఐ.పి.ఎస్. అయినా కాకపోతాడాని ఆశపడ్డాను. ఆ ఫీలింగ్‌తోనే వాడిని మేరేజ్ చేసుకున్నాను. చివరికి నా ఫేట్ ఇలా అయ్యింది. మనిషి నీరస పడిపోయి సోఫాలో కూర్చున్నదల్లా శిరోభారం మూలాన చేత్తో తలపట్టుకుంది నీరజ.

'డల్‌గా వున్నట్టున్నావ్! ఆయాని కేకేసి హాట్ హాట్‌గా హార్లిక్స్ తెమ్మని చెప్పేదా? - పక్కనే వున్న తల్లి కూతురి తలనిమురుతూ అడిగింది.

'వద్దులే అమ్మా!.... అదికాదు డాడీ... నా కార్లో ఆఫీసు దగ్గర డ్రాప్ చేస్తాను రమ్మంటే రాడు! నా వెంట కార్లో ఆఫీసుకు రావటానికి ఆయన గారికి నామోషి! స్కూటర్లోనే వెడతానంటాడు. అదే మంటే కొని పదేళ్లయినా.. అచ్చొచ్చిందంటాడు. వాట్ ఏ మాన్ హీ ఈజ్..?

'అది కూడా కాదమ్మా! అతనిలో బహిర్గతం కాని కాంప్లెక్సిటీ ఏదో దాగి వుంది. దానకి తోడు ఆర్థిక మాంద్యం వల్ల కంప్యూటర్ రంగం బాగా దెబ్బతినడంతో డెబ్భైవేల జీతం కాస్తా పాతిక వేలకు పడిపోవటం మరో కారణమైంది. భరద్వాజ్ డిప్రెషన్‌లో వున్నాడ్పస్తోంది....'

'నేనమ్మను! అదొక సిల్లీ రీజన్ అయివుండచ్చు!- మొన్నటికి మొన్న నా ఎ.టి.ఎం. కార్డ్ కావాలని అడిగాడు. ఇవ్వనన్నాను. తాను దాచుకున్న డబ్బు ఏమైందని నిలదీశాను.

సమాధానం ఇవ్వకుండా..గొణుక్కుంటూ వెళ్లిపోయాడు బైటికి...

'నువ్వు మరీను... ఇస్తే ఏం పోతుంది? అడిగింది నీ మొగుడే కదా!... పరాయి వాడుకాదు కదా?'

తల్లి సమర్థింపు నీరజకు నచ్చలేదు.

'లెక్క పత్రం లేకుండా ఎంత 'డ్రా' చేసుకుంటాడో ఎవరకి తెలుసు?-అయినా ఎవరి డబ్బు వాళ్లే ఖర్చు పెట్టు కోవటం కల్చర్! పెళ్లాం డబ్బు కోసం ఆశపడే ఫూల్‌ని నేను లైక్ చేయలేను. అంతగా తన జీతం తక్కువ వస్తున్నదనుకుంటే... బెటర్ శాలరీ కోసం మరో కంపెనీలో జాయినవ్వాలి! దట్సాల్...' చిరు కోపం ధ్వనించింది నీరజ మాటల్లో..

'నీ ఉపోద్ఘాతాలు... ఉపన్యాసాలు ఆపి... అరమరికలు లేకుండా మీరిరువురూ సఖ్యతగ అన్యోన్యంగా వుండండి! ఇద్దరు చదువుకున్న వాళ్లు. మీ మధ్య బేధ భావాలు... బేదాభిప్రాయాలు చోటు చేసుకోకూడదు. అండ్రస్టాండ్..' నీరజను మృదువుగా మందలించాడు రమోజీరావ్.

★ ★ ★

'నేనెంతో సర్దుకు పోదామని శత విధాలా ప్రయత్నిస్తుంటే... భరద్వాజ్ బిహేవియర్‌తో విసుగొచ్చేస్తోంది. సహనం కోల్పోక తప్పటం లేదు.' తండ్రితో కంప్లైంట్ చేసింది నీరజ మరొకరోజు.

'మళ్లీ మొదలైందా మీ గొడవ..?' తలపట్టు కున్నాడు రామోజీరావ్.

'మా ప్రాబ్లమ్ ఎప్పుడు సాల్వ్ అయింది కనుక?...' నొసలు చిట్లించింది నీరజ.

'అసలేం జరిగిందో చెప్పు నీరూ...'

'నేను మీ అల్లుడుగారి చెవిలో జోరీగలా రొద పెట్టగా...పెట్టగా...ఎట్టకేలకు డొక్కు స్కూటర్ షెడ్లోకి తోసేసి నా కార్లో ఆఫీసుకు బయలు దేరటానికి అంగీకరించాడు.

'మరింకేం'?

'సరిగ్గా అక్కడే మొదలైంది ప్రాబ్లమ్...'

'ఎందుకని?'

'నేను డ్రైవ్ చేస్తా నంటే వప్పుకోలేదు. తాను డ్రైవ్ చేస్తే, నేను పక్కన కూర్చోకూడదట. వెనక సీట్లో కూర్చోబోతే.. నేనేమైనా కారు డ్రైవర్‌నాని రెచ్చి పోయి

మాట్లాడాడు. చివరికది పోట్లాటగా మారింది. లాభం లేదు డాడీ... అతని శాడిజమ్ నేను భరించలేను.

'నీరూ... నీ భర్తని నువ్ చీపురు పుల్లలా మరీ తీసి పారేస్తున్నట్టు మాట్లాడటం మానుకో... లేకపోతే మీ కాపురం ప్రశాంతంగ మనశ్శాంతితో ముందుకు సాగదు. ఇరువురకీ సుఖముండదు... రామోజీ మాటల్లో ఆవేదన వ్యక్తమైంది.

'అదలా వుంచు డాడీ..! ఆయనగారు చేస్తున్న వుద్యోగం మానేస్తాడట...'

'మానేసి?'

'బిజినెస్ చేద్దామని వుందట...'

'కేపిటలో...'

'నేనున్నానుగా బంగారు పిచ్చుకను!...'

'పిచ్చుకవో... బాతువో... ఆ విషయం పక్కన పెడితే... వ్యాపారానికి ఎంత పెట్టుబడి కవాలట...?'

'నెత్తిన రూపాయి పెడితే పది పైసలు ఖరీదు చేయని మీ అల్లుడికి పది కోట్లు కావాలట! అదేమంటే... అంతకంటే తక్కువైతే ప్రాజెక్ట్ ముందుకు సాగదట...'

'అల్లుడితో నేను వివరంగా మాట్లాడుతాను గానీ... ఈ డిస్కషన్ ఇక్కడితో ఆపేయ్ నీరూ.... పద ఇద్దరం కలిసి లంచ్ చేద్దాం...'

"సమయానికి అక్కడ ప్రత్యక్షమైన రంజని భర్త కూతురు ముఖాల్లోకి చురగ్గా చూస్తూ 'అల్లుడు ఇంటికి రాకుండానే...తండ్రి కూతుళ్లు మింగి కూర్చుంటారా? ఇదేం మర్యాద? చురకేసింది.

'అలిగి వెళ్లి పోయిన అల్లుడుగారు మళ్లీ మనింటి గడప తొక్కుతాడో లేదో?' నీరజ మాటల్లో వెటకారం ధ్వనించింది.

ఆ మాటకు అక్కడున్న రామోజీరావ్ ... అవాక్కయ్యాడు.

★ ★ ★

'అదన్నమాట సంగతి! మొగుడి కంటే ఎక్కువ జీతం తెచ్చుకుంటూ వుద్యోగం చేసే భార్య వుంటే.. సంసారం ఇలాగే ఏడుస్తుంది... నువ్వేమో 'లవ్వు-గివ్వు' అంటూ ఆ పిల్ల వెంటపడి తాళికట్టేశావ్! నీ పెళ్లి మూడో కంటికి తెలీకుండా జరిగిపోయింది. నీకు అమ్మానాన్న లేక పోయినా బాబాయిని కనుక....పై పెచ్చు ఆస్థిపాస్తులున్న వాడిని

కనుక నిన్ను పెంచి పెద్ద చేసి చదివించి ప్రయోజకుడిని చేస్తే... కనీసం నీ పెళ్లి విషయంలో నన్నే సంప్రతించక పోతివి!-చివరికేమైందో చూడిప్పుడు. నిన్నొక చవటని చేసింది నీ వైఫ్!-ఓరే మప్పు... తొందరపడినందుకు నీకు పడిన శిక్షకు బాధ్యత వహించాల్సింది నువ్వే మరి...' మెత్తగా చెప్పుతో కొట్టినట్టు వాయించాడు శ్రీనివాస్‌రావ్.

'తొందరపడ్డానేమో అంకుల్...' గొణిగాడు భరద్వాజ్

'ప్రేమ వివాహాలంటే... ఇదిగో ఇట్లాగే తగలడతాయ్... కోర్టు దాకా వెళ్లకుండా... విడిపోయే మార్గం చూడు! - తర్వాత మంచి బుద్ధిమంతురాలైన పిల్లని చూచి నీకు మళ్లీ పెళ్లి చేస్తాను. హాయిగా ఇక్కడే నాతో పాటు ఈ పల్లెలో వుంటూ పొలం పన్లు చూచుకుందువు గాని!-నాకు మాత్రం పిల్లలెవరున్నారని? మీపిన్ని చచ్చి పోయాక ఆమె పట్ల వుండే మమకారంతో మళ్లీ పెళ్లి చేసుకోకుండా వంటరిగానే బతికేస్తున్న విషయం నీకు తెల్సుగదా?

బాబాయ్ చెప్పేదంతా బాగానే వుంది గాని... పల్లెలో వుండాలంటేనే బాధన్పిస్తోంది భరద్వాజ్‌కు. సిటీ లైఫ్‌కి అలవాటు పడిన తాను... ఇప్పుడు విలేజ్‌లో వుండాలంటే కష్టంగ తోచింది.

'బాబాయ్! నేను బిజినెస్ చేద్దామనుకుంటున్నాను...'

'ఎంత కావాలేంటి'

'ఎంతోనా? ఓ పది కోట్లు...'

ఆ మాటకు శ్రీనివాస్‌రావ్‌కి మతిపోయినట్టయింది. నా ఆస్థి మొత్తం అమ్మినా రెండు కోట్లకు మించదురా అబ్బాయ్! ఎచ్చులకు పోవద్దురా... నా మాట విని నువ్విక్కడే వుండిపో...' భుజం తట్టాడు.

'వ్యాపారం సాగేట్టు లేదుగానీ బాబాయ్... ఉద్యోగమే మేలన్పిస్తోంది... పాతిక వేలు జీతం వచ్చినా సిటీలో నేనొక్కడినే హాయిగా బతికేయగలను... తెల్లారే వెళ్లి పోతాను, బాబాయ్! శలవు రెండు రోజులే పెట్టాను...'

'సరే... ఇంద ఈ పదివేలు వుంచు. నీ దారి ఖర్చులకైనా పనికొస్తాయ్...' ఇనప్పెట్టెలోంచి నోట్లకట్ట తెచ్చి భరద్వాజ్ చేతిలో పెట్టాడు శ్రీనివాసరావ్.

'నీకెప్పుడు ఏ అవసరమొచ్చినా ఓ వుత్తరం ముక్కరాసిపడేయ్. అడిగినంత కాక పోయినా ఎంతో కొంత సర్దుతూంటాను...' మళ్లీ శ్రీనివాసరావే అన్నాడు.

★ ★ ★

సిటీలోనే వుంటున్నా.... అరు నెలలుగా నీరజ ముఖం చూడ లేదు సరికదా... అత్తవారింటి గడపైనా తొక్కలేదు భరద్వాజ్.

'అల్లుడూ! నువ్వు జాబ్ రిజైన్ చేశావనకుంటున్నాను. నా ఆలోచన పొరపాటే! నన్ను మన్నించు... 'అప్పుడే భరద్వాజ్ ఆఫీసులోకి అడుగు పెట్టిన రామోజీరావ్ అల్లుడు కళ్ళబడగానే సంబరపడి పోతూ మాట్లాడాడు.

ఓరి దుర్మార్గుడా?... మళ్ళీక్కడికీ వచ్చావా? నువ్వూ నీకూతురు నన్ను మనశ్శాంతితో బతకనివ్వరా..? మనసులోనే గొణుకున్నాడు భరద్వాజ్.

'నువ్వు వెంటనే మనింటికొచ్చేసెయ్... నీకో గుడ్ న్యూస్ చెప్పాలి...

అదేదో ఇక్కడే ఇప్పుడే చెప్పి ఏడవచ్చుకదా... మనసు మూలిగింది.

'నువ్వు రానంటే... సీతను రావణాసురుడు బలవంతాన ఎత్తుకుపోయినట్టు... నిన్ను నేను నా భుజాలమీద ఎక్కించుకుని మరీ వెళతాను... ఏమనుకున్నావో?- 'రామోజీరావ్ మాటల్లో ఆనందం వుత్సాహం తొంగి చూచింది.

నువ్వునిజంగా రావణాసురుడి సంతతికి చెందిన రాక్షసుడివే...అంతపని చేస్తావ్... అనుకున్నాను మనసులో.

'ఏ మిటాగుడ్‌న్యూస్ అని అడగవేం!? భరద్వాజ్ అన్నాడు.

అదీ మీరే చెప్పేడవండి అనే భావనతో మామగారి ముఖంలోకి తేరి పార చూశాడు.

'నీ భార్యకి.. అదే నా కూతురు నీరజకు...' చెప్తూ ఆగేడు రామోజీరావ్.

ఆ! మళ్ళీ మరొకడితో పెళ్ళా?' పళ్ళు పటపట కొరక్కుండానే గుర్రుగా చూశాడు భరద్వాజ్.

'నువ్వు రావాలి! పంక్షన్లో వుండాలి!...'

'మీరు చెప్పింది విని డూడూ బసవన్నలా.. గంగిరెద్దులా తలూపి తోకాడిస్తూ మీ వెంట రావటానికి నేనేం మఫ్‌ని కాదు...'

'అల్లుడూ! ఇది ఆఫీసు... ఇక్కడ మనం 'ఇండీసెంట్'గా మాట్లాడు కుంటే పది మందీ విని నవ్విపోతారు. కనుక ఫాలోమీ... కార్లో మనింటికి పోతూ విషయాన్ని వివరంగా చెప్తాను.. ప్లీజ్!!!'

అంతగా పెద్దాయన...పదే పదే ప్రాదేయపడుతూంటే కాదన్లేక ఎర్లీ.పర్మిషన్ తీసుకున్న భరద్వాజ్ మామ గారి వెంట నడిచాడు.

ఇద్దరూ కారు వెనుక సీట్లో కూర్చున్నారు.

'అల్లుడూ! నువ్వు డాడీ కాబోతున్నావ్... నీరజకు ఇప్పుడు సెవెన్త్‌మంత్...రేపే మనింట్లో గ్రాండ్‌గ సీమంతం జరుప్ బోతున్నాం! వూళ్లో వుంటూనే మమ్మల్ని మర్చిపోయావా?.. ఇక నీకా ఛాన్స్ వుండదు.ఎందుకంటే... నీవు ఫాదర్ కాబోతున్నావ్ కదా!?.... నీ బాధ్యత మరింత పెరుగుతుంది కనుక... అండ్రస్టాండ్...' పక పక నవ్వేడు రామోజీరావ్.

'అర్థం చేసుకోలేనంత మఫ్‌ని కాదు నేను.... నీరజ దృష్టిలో నేను మఫ్‌నే కావచ్చు ... కానీ లోకం దృష్టిలో మాత్రం కాదు..' నిష్ఠూరంగా అన్నాడు.

'అనెవరన్నారు. నిన్ను నీవు తక్కువ చేసి మాట్లాడుకోకు. భార్యా భర్తల మధ్య అనేక గొడవలుండవచ్చు' అంత మాత్రం చేత ఒక్కరికొకరు కాకుండా పోతారా? బంధుత్వం తెగిపోతుందా? బీహేపీ... సలహా ఇచ్చాడు రామోజీరావ్.

కారు బంగళా పోర్టికోలో ఆగింది.

వాకిట్లో భర్త కోసం ఎదురు చూస్తున్న నీరజ మెట్టు దిగొచ్చి చిరునవ్వుతో భరద్వాజ్‌ను ప్రేమపూర్వకంగా రిసీవ్ చేసుకుంది!

భార్య దృష్టిలో తాను 'మఫ్' అయినందుకు బాధపడని భరద్వాజ్ త్వరలో తాను తండ్రి కాబోతున్నాందుకు మురిసిపోయాడు!!

-: సమాప్తం :-